క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఏలూరు విద్యుత్ ఈఈ


ఈఈ అంబేద్కర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమితులైన కేఎం.అంబేద్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌ను విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. డిస్కమ్ జనరల్ సెక్రటరీ తురగా రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎం. నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.నరసింహారావు, డివిజన్ కార్యదర్శి సీహెచ్‌పీ శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


బాల్య వివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో బాల్య వివాహాలను అరికట్టడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కైలాష్ సత్యార్థి ఫౌండేషన్, చైల్డ్‌రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్. రవిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సెయింట్ థెరీసా బాలికల జూనియర్ కళాశాలలో బాల్యవివాహ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తామని విద్యార్థులతో ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ .ఫాతిమా దిగాల్, చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జీ.రాజలక్ష్మి, ఆర్. వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ హామీలను గుర్తు చేస్తూ నిరసన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి గుర్తు చేసేందుకు ప్రత్యేక నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన రావు తెలిపారు.బుధవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద థాలి బజావో కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రిజర్వేషన్ల అమలు కోసం అంబేడ్కర్ ఎనలేని కృషి

ఏలూరు (టూటౌన్): పేద బడుగు బలహీన, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల కోసం డాక్టర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో 93వ పూనా ఒప్పందం దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంకే గాంధీ నిర్ణయాలు, పూనా ఒప్పందం ఎస్సీ కులాల రాజకీయ భవిష్యత్తును నాశనం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గారపాటి నాగేశ్వరరావు, వెంపా నాగరాజు పాల్గొన్నారు.

కొవ్వలిలో ఉపవాస ప్రార్థన

దెందులూరు: దేవునితో మాట్లాడటమే ప్రార్థన అని, దేవుడిని నమ్మి కొలిచిన విశ్వాసులకు సమస్తం సాధ్యపడుతుందని సువార్తీకులు అన్నారు. కొవ్వలి బేతేలు సువార్త మందిరంలో 6 రోజులు పాటు కొనసాగనున్న ఉపవాస కూడిక ప్రార్థనలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విశ్వాస కూడికలకు ఏలూరు, దెందులూరు, భీమడోలు, పెదవేగి మండలాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల్లో నిరుత్సాహం

- అమలుకాని సంక్షేమ పథకాలు
- కూటమి నాయకులను ప్రశ్నిస్తున్న మహిళలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో 11,798 మందికి రూ.35.43 కోట్ల లబ్ధి


వైఎస్సార్‌సీపీ హయాంలో పొందిన పథకాలను చూపుతున్న మాదేపల్లి డ్వాక్రా మహిళలు (ఫైల్)

ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం మాయ మాటలకు మహిళ లోకం మోసపోయింది. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనప్పటికీ డ్వాక్రా మహిళల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదు. కనీసం ఒక్క కుటుంబానికి మేలు జరగలేదు. సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతి మహిళలకు నెలకు రూ.1,500 లబ్ధి, మహిళలు అందరికీ ఉచిత బస్ ప్రయాణం అంటూ ఊకదంపుడు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం పాలనా తీరుపై మహిళల్లో క్రమంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామాల్లో చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మహిళల నుంచి ప్రశ్నల వర్షం కురుస్తోంది. గ్యాస్ బండలు ఎప్పుడిస్తారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అమ్మకు వందనం ఎప్పుడు అమలు చేస్తారంటూ నాయకులను మహిళలు నిలదీస్తున్నారు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మా ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా నిధులు జమ చేశారని గుర్తు చేస్తున్నారు. ఒక్కొక్కరం రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకూ లబ్ధి పొందామని చర్చించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో మరువలేని పథకాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయంలో మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా పయనించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వైఎస్‌ఆర్ ఆసరా పథకంతో మహిళల బ్యాంకు రుణాలు క్రమపద్ధతిలో రద్దయ్యాయి. మహిళలు బ్యాంకులకు చెల్లించిన వడ్డీ సైతం, సున్నా వడ్డీ పథకం పేరుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి వారి ఖాతాల్లో జమ చేసి ఔరా అనిపించింది. నాడు అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల డ్వాక్రా సంఘాలు బలోపేతమయ్యాయి. వైఎస్ఆర్ ఆసరా పథకం పేరుతో మహిళలు అన్ని రంగాల్లో స్వశక్తితో ఎదిగేలా ఆర్థిక భరోసా కలిగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2019 నుంచి 2023 వరకూ దాదాపు అన్ని సంఘాల్లో మహిళలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రుణ విముక్తులను చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా సంఘాల రుణమాఫీ చేసి అందరి మన్ననలు అందుకున్నారు.

కోట్ల రూపాయల లబ్ధి

ఏలూరు నియోజకవర్గంలో విలీనమైన 7 గ్రామాలతో పాటు ఏలూరు రూరల్ గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల సభ్యులు మొత్తం 11,798 మంది లబ్ధి పొందారు. వీరికి ప్రభుత్వం రూ.35.43 కోట్లు చెల్లించింది. ఇందులో ఏలూరు రూరల్ గ్రామాల సంఘాల సభ్యులు 5,860 మంది మొత్తం రూ.14.95 కోట్లు అందుకోగా, విలీన గ్రామాల సభ్యులు 5,938 మంది రూ.20.48 కోట్లు అందుకున్నారు. ఇందులో రూ.10 వేల నుంచి రూ.15 లక్షల వరకూ లబ్ధి పొందిన సంఘాలు ఉండడం విశేషం.

సంఘాలు బలోపేతం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో విడతల వారీగా అందుకున్న మొత్తంతో సంఘం సభ్యులు ఆర్థిక స్వాలంబన వైపు అడుగులు వేశారు. ప్రభుత్వం కోళ్ల, మేకల, గొర్రెలు, గేదెలు అందించి పశు పోషణను ప్రోత్సహించింది. ఫలితంగా మహిళలు పాలు, పెరుగు, చేపలు, మాంసం, కిరాణా, కుట్టు మిషన్, పౌల్ట్రీ, సూపర్ మార్కెట్, పండ్లు, బట్టలు వ్యాపారం నిర్వహించారు. ఫలితంగా గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చిందని సామాజిక శాస్త్రవేత్తలు సైతం ఒప్పుకున్నారు. మహిళలకు ఆర్థిక భద్రత పెరిగి, భర్తతో పాటు భార్య సైతం కుటుంబ పోషణలో భాగమయ్యింది. ఈ కారణంగా పేద కుటుంబంలోని పిల్లల ఉన్నత విద్య వైపు అడుగులు వేయడంతో సామాజిక అభివృద్ధి సాధ్యమైంది.

మహిళలకు మేలు జరిగింది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు చాలా మేలు జరిగింది. వైఎస్సార్ ఆసరా పథకంతో డ్వాక్రా సంఘం రుణాలు చెల్లించారు. దీనివల్ల ఎంతో మంది మహిళలు లబ్ధి పొందారు. ఒక్కొక్క సంఘం రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ అందుకున్నారు. తీసుకున్న రుణాలు చెల్లించి, కొత్త రుణాలు తీసుకున్నారు. పశుపోషణ, వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలకు చేదోడుగా నిలిచారు.

– వర్రి లక్ష్మీదుర్గ, సర్పంచ్, కోటేశ్వరదుర్గాపురం

ఏడాదికి మూడు పథకాలు



వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలు ఏడాదికి మూడు పథకాలు అందుకున్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత ఇలా ఏ పథకం అమలు చేసినా మహిళలకే లబ్ధి చేకూరేది. లబ్ధిదారులు అందరూ మహిళలే ఉండేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి నెలా ప్రతి ఇంటిలో లబ్ధిదారులు ఉండేవారు. ఏడాదికి ఒక్కొక్క కుటుంబం రూ.50 వేల నుంచి లక్ష రూపాయలు లబ్ధి పొందేవి.

– పత్యాల సునీత, సర్పంచ్, మల్కాపురం

ఎమ్మెల్యే రఘురామపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు


బేతాళ సుదర్శనం

ఏలూరు (టూటౌన్): ఉండి నియోజకవర్గం ఏలూరుపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు స్వయంగా తొలగించి ఒక వర్గానికి కొమ్ము కాయడంపై జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం తెలియజేశారు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలను ఆయన సోమవారం ఏలూరులో చేసారు. అనేక నేరాలకు పాల్పడిన రఘురామ కృష్ణరాజుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల ప్రమాణ పత్రంలో ఆయనపై 10కి పైగా క్రిమినల్ కేసులు నమోదైనట్లు తెలిపారని, అందులో ఆర్థిక నేరం కూడా ఉందన్నారు. ఆ కేసుల్లో ఒకటి సీబీఐ కేసు ఉందన్నారు. ఆర్థిక నేరాల చరిత్ర ఉన్న వ్యక్తి రాజకీయ పదవిని దుర్వినియోగం చేస్తూ తప్పించుకుంటున్నారని విమర్శించారు. ఆయన ఏలూరుపాడులో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించారన్నారు. ఈ సంఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజును వెంటనే అరెస్టు చేయాలని కోరారు.

26న ఏచూరి సంస్మరణ సభ

ఏలూరు (టూటౌన్): సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఈనెల 26న నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం తెలిపారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన మంగళవారం నాయకులు సమావేశమయ్యారు. 26న సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని శ్రీ కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

ఏలూరు (టూటౌన్): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బిడ్డ ఆరోగ్యవంతంగా జన్మిస్తుందని జిల్లా మహిళా సాధికారత అధికారిణి కేపీఎల్ పద్మావతి అన్నారు. స్థానిక కెనాల్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం రక్తహీనతను నివారించవచ్చునన్నారు. ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఏ.పద్మావతి, ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు, పోషణ కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌సీ డాక్టర్ పావని ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు చేశారు. కార్యక్రమంలో ఈఓ మల్లిక, సూపర్‌వైజర్లు బి.మంగ, మీనాక్షి, మౌనిక, ప్రథమ్ శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడులను దళిత సమాజం ఉపేక్షించదు


మాట్లాడుతున్న ఏలూరు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల పాలనా కాలమంతా దళితులపై దాడులు జరిగాయని ఏలూరు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు గుర్రాల రవికుమార్ విమర్శించారు. స్థానికంగా నిర్వహించిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని అవమానించే విధంగా అహంకార పూరితంగా పీకివేయడం చాలా దుర్మార్గం అన్నారు. తప్పును కప్పి పుచ్చుకోవడానికి సదరు ఎమ్మెల్యే క్రైస్తవ మతాన్ని సాకుగా చూపడం చూస్తే మతాల మధ్య చిచ్చు పెట్టే కుట్రగా అనుమానించాల్సి వస్తుందన్నారు. కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీ దళిత అధికారిపై అసభ్యకరంగా దుర్భాషలాడుతూ దాడి చేయడం దుర్మార్గం అన్నారు. దళిత అధికారులు, దళిత ప్రజలను అణగ దొక్కాలని చూస్తే సమాజం ఉపేక్షించదన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది పేద, దళిత ప్రజలను ఆయా వర్గాలకు చెందిన అధికారులను వేధించడానికి కాదని గుర్తు చేశారు. తక్షణం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణ రాజు, కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీలు దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీరిశెట్టిగూడెం మత్స్యకార సహకార సొసైటీ చైర్మన్ పెనుమాల సంజీవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరం ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం 'ఎన్‌ఎంఎంఎస్'

దెందులూరు: ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని దెందులూరు ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ మంగళవారం పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనం అందిస్తారన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్షల రుసుము రూ.100 చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష రుసుము రూ.50 చెల్లించాలన్నారు. పరీక్షా రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా చెల్లించాలన్నారు. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

దత్తత పిల్లల్ని కన్నబిడ్డలుగా సాకాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి


దత్తత పత్రాలను తల్లిదండ్రులకు అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): దత్తత ఇచ్చిన పిల్లల్ని కన్నబిడ్డల్లా సాకాలని, వారికి ఉజ్వల భవిష్యత్తు అందించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన పాతకోటి సురేందర్, విజయలక్ష్మి దంపతులకు మనోజ్ అనే బాలుడిని, ఒడిశాకు చెందిన మేనకేతన్ మహరణ, సంధ్య మహరణ దంపతులకు మహేష్ అనే బాలుడిని దత్తత ఫైనల్ ఆర్డర్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దత్తత ఇచ్చిన రెండునెలల తరవాత తల్లితండ్రులు చిన్నారులను ఏ విధంగా చూసుకుంటున్నారని పరిశీలించిన అనంతరం ఫైనల్ దత్తత ఉత్తర్వులు అందిస్తామన్నారు. దత్తత తీసుకున్న పిల్లలకు చట్ట ప్రకారం అన్ని హక్కులు సంక్రమిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి, శిశు గృహం మేనేజర్ కె.భార్గవి పాల్గొన్నారు.

చిల్డ్రన్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ నిర్వహణపై సమీక్ష

ఏలూరు(మెట్రో): జిల్లా పరిధిలో మహిళలు, పిల్లల కోసం నిర్వహిస్తున్న హోమ్‌లు (ఉమెన్ అండ్ చిల్డ్రన్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌) అన్నింటిపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చే విధంగా సంబంధిత కమిటీలను బలోపేతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో చిల్డ్రన్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ నిర్వహణ విధి విధానాలపై ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉమెన్ అండ్ చిల్డ్రన్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్‌పై గట్టి నిఘా ఉంచే దిశగా జిల్లాలో ప్రత్యేకంగా జాయింట్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఎన్‌సీపీసీఆర్ గైడ్‌లైన్స్ ప్రకారం సీసీఐలు హాస్టళ్లు, ఇతర ప్రైవేటు లేదా స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే హోమ్‌లకు రిజిస్ట్రేషన్లు, వారి విధి విధానాలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కె. పద్మావతి, జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ కె. దుర్గాప్రసాద్, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మందులను వినియోగించవద్దు


ఏలూరు మెడికల్ కాలేజీలో ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలకు హాజరైన ఫార్మకాలజీ వైద్య బృందం

ఏలూరు టౌన్: ప్రజలు ఇష్టారాజ్యంగా మందులను వినియోగించటం ద్వారా కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు 4వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు చేపట్టినట్లు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈనెల 17న ప్రారంభమైన జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఫార్మకాలజీ వైద్య బృందం ఈ వారోత్సవాలను నిర్వహించటంతోపాటు ఏలూరు నగరంలో ప్రజలకు, ఏలూరు జీజీహెచ్‌కు వైద్యసేవలకు వచ్చే రోగులు, సహాయకులకు, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థినులు, సిబ్బందికి విస్తృతంగా అవగాహన కల్పించారని తెలిపారు. ఈ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఏలూరు జీజీహెచ్‌లోని ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఎంసీ (అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మోనటరింగ్ సెంటర్)ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సెంటర్ ద్వారా మందుల వినియోగంతో కలిగే చెడు ప్రభావాల సమాచారాన్ని సేకరించి జాతీయ స్థాయి అధికారులకు రిపోర్ట్ చేశామన్నారు. వైద్యుల సలహా లేకుండా మందుల వినియోగంతో కలిగే నష్టాలను నివారించేందుకు ఏఎంసీ సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. ఈ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.భాస్కర్, వైస్ ప్రిన్సిపల్(అకాడమిక్) డాక్టర్ పీ.సత్యనారాయణ, ఏలూరు జీజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్ఎంవో డాక్టర్ దుర్గాకుమార్, డిప్యూటీ అస్ట్రోనెల్ సూపరింటిండెంట్ డాక్టర్ మల్లిఖార్జున, పార్మకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మావతి, అసోసియేట్ ప్రొఫెసర్స్ డాక్టర్ ఎస్.విజయకుమార్, డాక్టర్ పీ.రాజసులోచన తదితరులు ఉన్నారు.

నేటి నుంచి బాణసంచా షాపులకు లైసెన్సులు

దెందులూరు: దీపావళి సందర్భంగా బాణసంచా సామగ్రి విక్రయదారులకు తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునేవారు బుధవారం నుంచి వచ్చే నెల 15వ తేదీలోపు ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని దెందులూరు తహసీల్దార్ మంగళవారం బి.సుమతి తెలిపారు.

పూలే దంపతుల ఆశయాలను నెరవేర్చాలి


కస్తూర్బా స్కూల్లో సావిత్రి బాయి పూలేకు నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం జ్యోతిరావు పూలే దంపతులు సత్యశోధన సమాజాన్ని ఏర్పాటు చేశారని వారి ఆశయాలను యువత కొనసాగించాలని బోఫ్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సత్యశోధన సమాజం ఏర్పడి 151 సంవత్సరాలు, పూలే దంపతులు ప్రారంభించిన కామన్ స్కూల్ 175వ వార్షికోత్సవం సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా స్థానిక కస్తూర్బా నగరపాలక బాలికల హైస్కూల్లో సోమవారం సభ నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి గుబ్బల నాగేశ్వరరావు, జీ. రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కస్తూర్బా హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జీ. సునీత అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పీ. రవీంద్ర, మానవత ఏలూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యురాలు కే. జనని తదితరులు మాట్లాడారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	27
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

దుకాణ సముదాయాల్లో సీసీ కెమెరాలు ఉండాలి


వాణిజ్య, వర్తక సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో బులియన్ మర్చంట్స్ కల్యాణ మండపంలో వాణిజ్య, వర్తక సంఘాల ప్రతినిధులతో ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ ప్రాంతంలో దుకాణ సముదాయాల్లో విధిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బులియన్ వర్తక సంఘాల ప్రతినిధులు బంగారాన్ని కొనుగోలు చేసిన, తాకట్టు పెట్టిన వినియోగదారుని సమాచారాన్ని విధిగా తెలుసుకోవాలని హెచ్చరించారు. షాపుల వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా మెయిన్ బజార్‌లో నియమాలను పాటించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీస్‌స్టేషన్ లేదా 112కు సమాచారాన్ని తెలియజేయాలని సీఐ కోరారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ళ బారిన పడితే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని, బాధితులకు సైబర్ సెల్ పోలీసులు సహాయం చేస్తారని తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే ఏలూరు ప్రజలు 95503 51100కు ఆధారాలతో వివరాలను వాట్సాప్‌లో పొందుపరచాలని సీఐ సత్యనారాయణ కోరారు. నేరాలను నియంత్రించేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు పైడేటి రామారావు, అధ్యక్షుడు తమ్మన మధుసూధన్‌రావు, సెక్రటరీ నంగులూరు సత్యనారాయణ, కొనకళ్ళ దామోదర్, మద్దాల మురళీ, జాయింట్ సెక్రటరీ వెన్నంరెడ్డి మహేష్, భాస్కర మణికంఠ, ట్రెజరర్ కనిగొళ్ళ మల్లిఖార్జునరావు, సంఘం సభ్యులు ఉన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాలతో పాటు, స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ఈ వేడుకలు నిర్వహించారు. సీఆర్ఆర్ కళాశాల ఆడియో విజువల్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ కేవీఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విభాగాన్ని మహాత్మాగాంధీ 100వ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని కళాశాలల్లోనూ జాతీయ సేవా పథకాన్ని అమలు చేశారని తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కేవీ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన యూనియన్ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ రిటైర్డ్ డైరెక్టర్ దిట్టకవి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవాభావాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే. విశ్వేశ్వరరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ జి. రాము, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2 విభాగాల ప్రోగ్రాం ఆఫీసర్లు ఎండీఎం బాషా, బి.శంకర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.